క్లుప్తంగా

25న అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 25వ తేదీన అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అశ్వనీకుమార్, అర్చకులు మహేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు అర్చనలు జరుగుతాయన్నారు. సాయంత్రం పడిపూజా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అదేరోజు ఉదయం అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా అభిషేకాలు, పూజలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 23న శనిత్రయోదశి సందర్భంగా శనీశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని భక్తులంతా పాల్గొనాలని కోరారు.

నీటిని చౌర్యం చేస్తే చర్యలు

● నగరపాలకసంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వేసవిని దృష్టిలో పెట్టుకుని కుళాయిలకున్న మోటార్లతో మంచి నీటిని చౌర్యం చేయరాదని.. అలా చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోటార్లతో నీటిని చోరీ చేస్తున్నట్టు నగరపాలక సంస్థ సిబ్బంది గుర్తించినట్లయితే మొదటిసారిగా రూ. రెండు వేలు జరిమానా విధించడంతోపాటు రీకనెక్షన్ కోసం రూ. 250 కార్యాలయంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే రెండోసారి గుర్తిస్తే శాశ్వతంగా కుళాయి కనెక్షన్‌ను తొలగిస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి వేసవిలో ఏ ఒక్కరికీ మంచినీటి సమస్య లేకుండా సహకరించాలని కోరారు. అలాగే వీధి కుళాయిల ద్వారా నీటి వృథాను అరికట్టాలని కోరారు.

బూరవెల్లిలో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు

గార: సార్వత్రిక ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని పలు పంచాయతీల్లో శుక్రవారం కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని బూరవెల్లిలో జరిగిన ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

ఎచ్చెర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్యామలాదేవి అన్నారు. శుక్రవారం భగీరథపురం గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మన ఓటు మన హక్కు అని అన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం రామ్మూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషిమాతకు పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాస శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ నేతృత్వంలో తెల్లవారు జామున మూలవిరాట్టుకు నమక చమక సహిత పంచ సూక్తములతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో కుంకుమ పూజలు చేసి మహానివేదన, మహా హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునగవలస సుకన్య, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట పూజలు

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. వేదపండితులు ఆరవెల్లి సీతారామాచార్యులు, శాంతాచార్యులు ఆధ్వర్యంలో భక్తులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుండ వర్గీయుల ఆందోళన

- చంద్రబాబు, లోకేష్ ఫొటోలతో పాటు టీడీపీ జెండా దగ్ధం
- టీడీపీ ప్రచార సామగ్రి సైతం కాల్చివేత
- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కేడర్ ఒత్తిడి

శ్రీకాకుళం:

శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా గొండు శంకర్‌ను ప్రకటించటంతో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వర్గీయులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అరసవల్లిలోని గుండ ఇంటికి చేరుకున్న నియోజకవర్గంలోని పార్టీ కేడర్ చంద్రబాబు, లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ నినాదాలు చేశారు. సుమారు గంట పాటు నినాదాలు చేస్తూ గుండ దంపతులు టీడీపీకి రాజీనామా చేయాలని, వైఎస్సార్‌సీపీలో చేరాలని లేకుంటే ఎంపీగా మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, శ్రీకాకుళం నియోజకవర్గం ఎమ్మెల్యేగా లక్ష్మీదేవి స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేయాలని ఒత్తిడి చేశారు. ఈ సమయంలో అనూహ్యంగా స్పందించిన కొందరు కార్యకర్తలు గదిలో ఉన్న చంద్రబాబు, లోకేష్ ఫొటోలను చించివేసి కాలితో తొక్కారు. ఇంట్లో, వారి ఇంటిపై ఉన్న టీడీపీ జెండాను తీసి వేసి దహనం చేశారు. అలాగే పార్టీ హామీలతో పాటు, సూపర్-6 పథకాల ప్రచార సామగ్రిని కాల్చివేశారు.

మేం ఎవరి వెనుక వెళ్లాలి

1985 నుంచి గుండ దంపతుల వెంటే తామంతా నడిచామని ఇప్పుడు గొండు శంకర్ వెనుక తిరగలేమని పలువురు నాయకులు చెబుతూ ఇండిపెండెంట్‌గా పోటీ చేయకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గుండ దంపతుల రాజకీయ జీవితం అంతం చేసేందుకు లోకేష్, అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు పథకం వేశారని ఆరోపించారు. ఎంపీని కచ్చితంగా ఓడించాలని లేదంటే వారి తీరులో మార్పు రాదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ టికెట్లు అమ్ముకుంటుందని చంద్రబాబు, లోకేష్ ప్రచారం చేస్తున్నారని ఇప్పుడు ధన బలం ఉన్న శంకర్‌కు టిక్కెట్ ఇవ్వటం చూస్తే చంద్రబాబు, లోకేష్‌లే టికెట్లు అమ్ముకున్నట్లు ఉందని అన్నారు. లక్ష్మీదేవికి ఉత్తమ ఎమ్మెల్యే అని, అప్పలసూర్యనారాయణ ఉత్తమ పౌరుడని బిరుదులు, అవార్డులు ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఆ కుటుంబానికి కాకుండా వేరే వ్యక్తికి ఎలా టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు.

తొందరపాటు నిర్ణయాలు వద్దు

ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఆలోచించి నిర్ణయం తీసుకుందామని చెప్పగా కార్యకర్తలంతా వారికి ఎదురుతిరిగారు. ఇంత జరిగినా రాజకీయ జీవితం అంతం చేయాలని చూసినా శాంతంగా ఉండటం సరికాదన్నారు. ఈ వేటు గుండ దంపతులపైన కాదని, పార్టీ నాయకులు, కార్యకర్తలపైన పడిందని మండి పడ్డారు. లక్ష్మీదేవి కలుగచేసుకుని కార్యకర్తలమంతా సమావేశమవుదామని, అందరి అభిప్రాయాలు తెలుసుకుందామని చెప్పారు.



కార్యకర్తలు రోడ్డుపైకి విసిరేసిన టీడీపీ జెండాలను చూస్తున్న మాజీ మంత్రి అప్పలసూర్యనాయణ



గుండ ఇంటి వద్ద టీడీపీ జెండాలకు నిప్పంటిస్తున్న కార్యకర్తలు



అప్పలసూర్యనారాయణ ఇంటిపై జెండాను తీసిపారేస్తున్న టీడీపీ కార్యకర్తలు

డోలోత్సవానికి వేళాయె..

● 24న కామదహనోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో డోలోత్సవాలను ఆదివారం నిర్వహించనున్నారు. దేశంలోనే ఏకైక సూర్య దేవాలయమైన అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో డోలోత్సావాన్ని వైభవంగా నిర్వహిస్తారు. అలాగే బలరామ ప్రతిష్ఠగా ప్రసిద్ధికెక్కిన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీకృష్ణమూర్తిలకు ఎన్నో ఏళ్లుగా ఈ ఉత్సవం జరుగుతోంది. ఆదివారం రాత్రి గుడివీధి కూడలి వద్ద స్వామివారిని పల్లకీలో ఉంచి కామదహనోత్సవంలో భాగంగా మన్మథుని పూలబాణంతో ఈశ్వరుడు మూడోకన్ను తెరచి భస్మం చేస్తారు. ఈ సందర్భంగా అక్కడ దహన ఉత్సవం నిర్వహిస్తారు. మరుచటిరోజు సోమవారం నాడు స్వామివారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డోలో మండపంలో డోలోత్సవంలో స్వామివారిపైన రంగులు చల్లి ఉత్సవం నిర్వహిస్తున్నారు. అందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, ఈవో సుకన్యలు తెలిపారు.



కోటేశ్వరస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణమూర్తి విగ్రహాలు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రణస్థలం: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించా లని ఎంపీడీఓ ఆర్.వి రమణమూర్తి తెలిపారు. మండలంలోని పాతర్లపల్లి, కోటపాలెం, అల్లివలస గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో శుక్రవా రం అధికారులు విస్తృతంగా పర్యటించారు. ప్రజలు ఏ పార్టీ ప్రచార చిత్రాలు ఇంటికి అంటించి ఉంచరాదని సూచించారు. గ్రామాల్లోని ఫ్లెక్సీలు కట్టడం, అధికారులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొనరాదన్నా రు. గ్రామాల్లో ఎటువంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా మీకు నచ్చిన పార్టీకి ఓటు వేయాల న్నారు. ఎన్నికల సమయంలో మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈఓపీఆర్‌డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



పాతర్లపల్లిలో పర్యటిస్తున్న అధికారులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద వాహనాలను జే.ఆర్.పురం ఏఎస్సై ఉమామహేష్, పోలీస్ సిబ్బంది శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. విజయనగరం జిల్లా నుంచి శ్రీకాకుళంలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే జిల్లాలోకి అనుమతించారు. సరైన పత్రాలు లేకుండా నగదు, మద్యం వంటివి అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

రణస్థలం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే పోలీసుల ప్రధాన లక్ష్యమని జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. మండలంలోని చిల్లపేటరాజాంలో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలపై గ్రామస్తులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రజాస్వామ్యం మీకు ఇచ్చిన హక్కు అని, ఎటువంటి ప్రలోబాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎవరూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దన్నారు. ఎస్సై గోవిందరావు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న జే.ఆర్.పురం సీఐ రామచంద్రరావు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎచ్చెర్ల: పోలింగ్ స్టేషన్ల సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా అమలు చేయాలని లావేరు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. లావేరు మండలంలోని వెంకటాపురం, అప్పాపురం, లావేరు, పెద్దలింగాలవలస గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లు శుక్రవారం తనిఖీ చేపట్టారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ మాధవరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అప్పాపురం పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కొండలరావు

ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటై ఎన్నికల్లో పోటీ చేసి చివరకు జగనన్న చేతిలో ఓటమి పాలవ్వడం ఖాయమని, ఈ మూడు పార్టీలు ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కనుమరుగు అవ్వడం తథ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బాతువ గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేసి ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేశారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన గుంపుగా వస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో వారికి ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు 600 హామీలు ఇచ్చారని ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు బూటు దమయంతి, బూటు అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్లు పల్లేడ సన్యాసిరావు, ఎర్నేన ప్రకాశరావు, మామిడి బలరాం, అధిత్యవర్మరాజు, మక్క సాయి తేజ, బూటు హరి, పాపినాయుడు, లక్ష్మణరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



పూజలందుకున్న విజయదుర్గ



ప్రత్యేక అలంకరణలో బాలత్రిపుర సుందరీదేవి

శ్రీకాకుళం కల్చరల్: నానుబాలవీధిలోని విజయదుర్గాదేవి ఆలయంలో ఫాల్గుణమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే బలగలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ నేతృత్వంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు పూజలు జరిగాయి.

కొత్తమ్మతల్లి హుండీల ఆదాయం లెక్కింపు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి గుడి, స్థానిక రెడ్డిక వీధిలోని మల్లేశ్వరస్వామి ఆలయాల హుండీల ఆదాయాన్ని శ్రీకాకుళం దేవదాయశాఖాధికారి జి.వి.బి.ఎస్.రవికుమార్ పర్యవేక్షణలో శుక్రవారం చేపట్టారు. కొత్తమ్మతల్లికి 42 రోజులకు రూ. రెండు లక్షల 59 వేలు, మల్లేశ్వరాస్వామికి 502 రోజులకు రూ. 87,165 ఆదాయం వచ్చినట్లు ఆలయాల ఈవో వి రాధాకృష్ణ తెలిపారు.

19 మద్యం బాటిళ్ల స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లను ప్రదర్శిస్తున్న పోలీసులు

రణస్థలం: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దేవరాపల్లి గ్రామ సమీపంలో జే.ఆర్.పురం పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన దురగాసి శివగణేష్ అక్రమంగా 19 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు జే.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు తెలిపారు. గణేష్‌పై కేసు నమోదు చేసి ఎస్ఈబీ పోలీసులకు అప్పగించామన్నారు.

అరసవల్లిలో కామదహనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చక బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో డోలోత్సవాల సంబరాలు శుక్రవారం సాయంత్రం నుంచి మొదలయ్యాయి. ఇందులో భాగంగా కామదహనోత్సవం కార్యక్రమం శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలిశంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కామదహనోత్సావాన్ని చేపట్టారు.



కామదహనాన్ని నిర్వహిస్తూ...

నీటిని పొదుపుగా వాడండి



ఎచ్చెర్ల: భగీరథపురంలో జల దినోత్సవం ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

ఎచ్చెర్ల: నీటిని పొదుపుగా వాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. లావేరు మండలంలోని అదపాక ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నీలంరాజు కృష్ణారావు అధ్యక్షత వహించారు. గిరిధర్ మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా చూడడం ద్వారా, మొక్కలు నాటడం ద్వారా నీటి వనరులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. నీటి ప్రాధాన్యతని, సంరక్షణ బాధ్యతని విద్యార్థులకు తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ అగతముడి వాసుదేవరావు మాట్లాడుతూ భూగర్భ జలాలు ఇంకిపోకుండా నీటి వనరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పూర్వ జిల్లా నాయకులు పుట్టా ఉదయ్‌కుమార్, బొడ్డేపల్లి జగన్నాథరావు, గుంటుకు మరళి, ఉపాధ్యాయులు రమణ, లక్ష్మణరావు, రుద్రప్రతాప్, లక్ష్మి, రాజేశ్వరి, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

ఎచ్చెర్ల: మండలంలోని భగీరథపురం గ్రామంలో ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శ్యామలాదేవి, ఏపీఎం రామ్మూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నీటి ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. నీటి నిల్వలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతలు తవ్వాలని, భూగర్భజలాలను పెంచాలన్నారు. సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మందస: మొక్కలు పర్యావరణానికి నేస్తాలని వక్తలు అన్నారు. పెద్దకేశుపురం, చిన్నకేశుపురం, బంజిరికేశుపురంలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. శాతవాహన కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొక్కలు ఆవశ్యతను వివరించారు. జీవరాశులన్నింటికి ఆక్సిజన్ ఎంతో అవసరమన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. మందస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్.రాంకుమార్, బి.శాంతారావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత

రణస్థలం: శ్రీకాకుళం నుంచి రణస్థలం వస్తున్న కొండములగాం గ్రామానికి చెందిన రామంజనేయ ఆచారి ఆర్టీసీ బస్సులో రూ.18వేలు నగదు పోగొట్టుకున్నాడు. రణస్థలంలో బస్సు దిగిన వెంటనే నగదు పోయిన విషయం గమనించి జే.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే బస్సు నంబర్, సమయం ప్రకారం పైడిభీమవరం ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. బస్సులో పడేసుకున్న నగదు దొరికింది. ఆ నగదును రామంజనేయ ఆచారికి జే.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు అప్పగించారు.



నగదు అందజేస్తున్న ఎస్ఐ గోవిందరావు